కథ

# శాంతి (?)

'ఇదో వెధవగేటు'

విసుక్కుంటూ పైనుంచి ఎడమచేయిచాచి గొళ్ళెంతీసి, సైకిలు రోడ్డో గోడ వారగానించోబెట్టి, తాళంవేసి ఇంటితాళం తీశాడు రాజు.

చెప్పుకింద కప్పలా ఇన్‌లాండ్ లెటర్.

నరసింహారావు రాసివుంటాడు ఇంకెవరు రాస్తారు? మాటిమాటికి నన్ను డబ్బు లడగకుమని గట్టిగానే రాసివుంటాడు. ఇంకెవరు రాస్తారు? ఇవ్వాళ ఎనిమిది పదోతేది దగ్గరపడ్డది. ఈమారు ఎవరూ మర్యాద దక్కించరు.

పుస్తకాలు స్టూలుమీదపడేసి కుర్చీలో జోగుపడ్డాడు.

బయట ఎవరిదో దగ్గుచప్పుడు. గుండె జల్లుమంది.

దగ్గుతూరావడం నాగయ్య అలవాటు. రెండునెలలవడ్డీ నూటికిపది నాలుగు వందలకు ఎనభైరూపాయలు ఇవ్వాలి. ఇవ్వాళ సాయంకాలం ఇస్తానన్నాడుతను. ఇవ్వక పోతే టాప్రిన్సిపల్ పట్టుకుపోక తప్పదన్నాడు నాగయ్య.

పక్కింటి మేడమీద ఎవరో కొత్తమనిషి. ఆకాశంలో వానమబ్బుల్ని చూస్తూ ఆనందిస్తున్నాడు. పక్కింటి చుట్టమేమో! దగ్గుచప్పుడువిని సగంనీరసించి మెల్లిగా వచ్చి మళ్ళీకుర్చీలో కూర్చున్నాడు. ఉత్తరం విప్పబుద్ధిగాలేదు కానీ విప్పకతప్పదు.

"బావా! పదోతారీఖు ఉదయం తొమ్మిదిగంటల బస్సుకు అక్కయ్యను పంపిస్తున్నాను. సవిత, కిరణ్ ఇక్కడే వుంటారు. వాళ్ళ అమ్మమ్మకు వాళ్ళతో బాగా పొద్దుపోతుంది. అక్కయ్యను, సెలవేశానీ, బుజ్జిగాణ్ణీ పంపిస్తున్నాను. అబ్బో ఏం అల్లరి! బుజ్జిగాడు తండ్రినే తలదన్నేశాడు."

'ఏడ్చాడు' ఉత్తరంమడిచి జేబులోపెట్టుకున్నాడు రాజు. మహేశ్వరి వస్తుందన్న మాట. ఇంకో ఆర్నెల్లు అక్కడేవుంటే ఏం కొంపమునిగేది? అప్పుడేరావాలా? ఎంతో చెప్పిపంపానే, పురిటికీపోతే నాలుగురాళ్ళు అప్పుతీర్చొచ్చు అనుకుంటే, వడ్డీలకు వడ్డీలుకట్టడంతోనే జీతంకాస్తా హరించిపోయింది. ఇప్పుడు వాళ్ళువస్తే, ఎన్నని తేవాలి? అన్నింటికి మళ్ళీ అప్పుచేయాలి! ఇంకెవడిస్తాడు? అన్నమాట నిల బెట్టుకుంటూవుంటే అయిదోపదో చేబదుళ్ళయినా దొరికేవి. ఇహ లాభంలేదు. ఈ జీవితానికిక విముక్తిలేదు.

రెండునెల్లుగా ఇంటికిరాయికట్టలేదు. తబదబ గేటుచప్పుడుచేస్తూ వాడువస్తాడు. ఇవ్వాళో రేపో! ఎప్పుడొస్తాడో ఏమంటాడో! ఎందుకు తనకు అప్పులు పెరిగాయి! ఏ సుఖాలకోసం తగలేశాడు? లేదే! సిగిరెట్టు తప్పిస్తే తనకు ఏవ్యసనమూ లేదు. తన మొండిధైర్యమే తన్ను కాల్చుకుతింటోంది. పాపం, మహేశ్వరి! ఎన్నాళ్ళని ఈ నరకయాతన అనుభవిస్తుంది! ఎంత జీతమొచ్చినా, బియ్యానికీ, కూరగాయలకే సరి పోవటంలేదు. వడ్డీలెలా కట్టేది? అప్పులెలాతీర్చేది?

చదువు, చదువు అని వూళ్ళో ఉద్యోగంచేస్తూ పట్నంలో కాపురంపెట్టి అప్పుచేసి ఏం వెలగబెట్టాను? చేతికొచ్చినడిగ్రీ చెల్లెలిపెళ్ళి అప్పుడంటే తక్కువ జీతం. ఇప్పుడు కొంచెం మెరుగే అయ్యిందే! కానీ అప్పులు పెరిగాయి. ఏడాదిక్రితం రెండువేలుంటే ఇప్పుడు నాలుగువేలు. అప్పులిచ్చేవాళ్ళకి రెట్టింపులాభాలు. వడ్డీ వ్యాపారం ఏంచక్కని బంగారుపంట! ఎవడి కొంపోముంచి ఎవడి కాళ్ళోపట్టుకొని ఈ వ్యాపారంచేస్తే ఈ చాలీచాలని పంతులు ఉద్యోగంకన్నా హాయిగా బతకొచ్చు. కానీ, నమ్మిఇచ్చేదెవడు? పైగా ఈపిల్లలు. వద్దురోబాబో అంటుంటే కొడుకు కావాలి ఇంకొక్కబిడ్డతో చాలిద్దామంది మహేశ్వరి, ఏం మమకారమో! ఆడవాళ్ళకు అన్నింటిమీదా ఆత్యాశే.

ధర్మయ్య ఇవ్వగలవాడే. నూటికిపది వడ్డీవ్యాపారం. గొడ్లచావిడిలో నిగనిగలాడే అయిదుగేదెలు. రేషన్‌కొట్లోవాటా. చాలాడబ్బుంది. పిల్లలులేని అశాంతి(తో) కొట్టుకుచస్తున్నాడు. ఎవడికిపెడ్తాడు? కానీ అతనికే తను పదిహేను వందలివ్వాలి. రెండునెల్లవాయిదా ఈఫస్టుతో తీరిపోతుంది.

ఛీ ఛీ ప్రతిమిత్రునికీ తనుబాకీ. కొత్తపాతాలేదు తనకి. డబ్బు స్నేహాన్ని కలిపింది. విడగొట్టింది. కొత్తవాళ్ళని ఎక్కడినుంచి పట్టుకురావాలి?

మహేశ్వరివస్తుంది. పిల్లలొస్తారు.
బయట గేటుచప్పుడు.

అద్దెకోసం రాలేదుగదా యజమాని! జేబులో ఇరవై రూపాయలులేవే! రాజు గబగబా బయటికొచ్చాడు.

...."కొంచెం ఈ అడ్రెసు ఎక్కడో చెప్పండిసార్."

నాకు తెలియదు అనబోయి చీటిచూసి "మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుందే" అన్నాడు రాజు, గుర్తుకు తెచ్చుకుంటూ.

"ఒకసారి నాగయ్యగారిదగ్గర చూసారండీ. నేనూ మీరూ ఒకరోజే అప్పు తీసుకున్నాం ఆయనదగ్గర."

"ఆః అలాచెప్పండి."

"మీ అప్పు తీరిందాండీ?

గుండెలోనే కొట్టుకుంటున్నాయి మాటలు. అప్పులేనివాణ్ణిచూస్తే మనసారా కౌగిలించుకోవాలనిపిస్తుంది. బ్రహ్మాండంగా అతణ్ని వీధివీధీ ఊరేగించి సన్మానం చేయాలనిపిస్తుంది.

రాజు ఒకసారి దీర్ఘంగాఆలోచించి "క్షమించండి. ఆ పక్కకొట్లో అడగండి" అన్నాడు వెనక్కితిరుగుతూ.

సైకిలు భద్రంగానేవుంది. ఇక్కడ ఇలాగేపెడితే రాజుఉన్నాడని ఏ అప్పులోడైనా రావచ్చుననుకొని, ఆలోచనరావడమే తరువాయి సైకిలుతెచ్చి ఇంట్లో పెట్టాడు.

రాజు ఇంట్లోకిచూస్తూ స్కూటరుమీద ఓ మీసాలపెద్దమనిషి జోరుగా వెళ్ళిపోతున్నాడు.

ధర్మయ్యకుకూడా స్కూటరుంది. ఒకనాటికి అతను కారుకూడా కొంటాడు. అప్పటికి సైకిలుకూడా వుంటుందో లేదో తనకి!

ఎం. ఎ. ప్యాసైతే ఏంలాభం? ప్రమోషన్‌కోసం చీమల్లావున్నారు పంతుళ్లు.

దగ్గుతోవచ్చే నాగయ్య.

స్కూటర్‌తో ధర్మయ్య.

గేటుచప్పుడుతో ఇంటి యజమాని.

నిద్రలో, కలలో, పెండ్లాంపక్కలో, ఎక్కడున్నా, తనకు యమలోకాన్ని గుర్తుకుతెస్తారు. మహేశ్వరికికూడా తన భయాలే, తన అనుమానాలే వచ్చాయి. రేపు ఇవి పిల్లలకురావని ఏమిటినమ్మకం?

పిల్లల్ని ఎట్లాపెంచేది? ఒక్కరా ఇద్దరా? ముగ్గురు. ఈరోజుతో ఈసమస్య తీరిపోతుందని ఎలానమ్మేది?

662

గుడ్డలిప్పదీసి టీ కోసం నీళ్లపెట్టాడు.

రాజు మనసు చీదరచీదరగావుంది. క్షణక్షణం గుండెజారి కిందపడి అద్దంలా ముక్కలై చెల్లాచెదరవుతుందనిపిస్తుంది.

గంటకు ఒక్కక్షణం.... ఒకే ఒక్కక్షణం.... మానసికంగా తీరికదొరికితే బాగుండును.

రోజుకో అరగంట శాంతి.

లేదు. తనకీ పేదరికంలో అప్పులబతుకులో ఈ ఉద్యోగంలో శాంతి లేదు. బళ్ళోపాఠాలు చెప్పలేక, పిల్లల అల్లరి భరించలేక తల బద్దలైపోతుంది. నడిచినా, కూర్చున్నా, నిద్రపోయినా, కలలో, మెలకువలో, అప్పులే అప్పులు, అశాంతి. శాంతీ, నీఖరీదు ఎంత? ఈ తుఫాను ఆగేదెప్పుడు? ఈ బతుకులో ఇక శాంతి కర్థం దొరకదు.

తనలా ఎందరు దౌర్భాగ్యులో!
బత్తీల స్టౌమంట టీపాత్రని నిర్దాక్షిణ్యంగా నలుపుచేస్తుంది.
తన మనసు అంతకన్నా అధ్వాన్నంగానే వుంది.

టీలో చక్కెరకలుపుతూ స్టౌ ఊదబోయాడు. ఎంతకూ ఆరిపోదే! రెపరెప మంటుంది. వూర్కుంటే మండుతుంది.

ఈ జీవి ఎలా పోతుందో!
కోపంగా గ్లాసెడు నీళ్ళు కుమ్మరించాడు.
ఈ ప్రాణం ఇలాగే చల్లబడి ఆరిపోతే బాగుండును.
ఇంతకన్నా వృద్ధాప్యం ఇంకేముంటుంది?
"సార్!"
టీకప్పుతో బయటికొచ్చాడు రాజు.
స్టూడెంటు
"రెండు లెక్కలు రావటం లేదండి చెప్తారా సార్?"
"రారా. టీ తాగుతావా ప్రభాకర్?"
"వద్దుసార్ టిఫిన్ చేసి కాఫీ తాగొస్తున్నా."
"ఇప్పుడే చెప్పాలా?"
ప్రభాకర్ తటపటాయించి, "మీకు పనుంటే రేపొద్దునొస్తానండి" అన్నాడు.
"సరే అట్లాగేచెయ్ ఏడుగంటలకల్లా వచ్చేసెయ్."

663

"సరేనండి"

ప్రభాకర్ వెళ్ళిపోయాడు.

నిజానికి తనకేమీ పనిలేదు. ఉన్న పనల్లా అప్పులాళ్ళనుంచి తప్పించుకు తిరగడమే. పోగ్రెసుకార్డులు పూర్తిచేసి పట్టుకురమ్మన్నాడు హెడ్మాష్టరు.

అది చేసెయ్యాలి.

కానీ, ఇంటోవుంటే నాగయ్య, ధర్మయ్య, అద్దెకోసం ఇల్లుగల్లాయన, ఎవరొస్తారో ఏమో!

లైటు వేశాడు.

క్షణం ఆలోచించి తలుపులేసి, బయటగొళ్ళెం, లోపలినుంచే స్టూలుమీద నిలబడి ద్వారబంధంమీది ఇనుపచువ్వల సందుల్లోంచి పెట్టేశాడు.

ఎవరైనా చూస్తే?

గుండె దడదడలాడింది. ముచ్చెమటలుపోశాయి. కాళ్లూ చేతులూ గడగడా వొణికాయి. నిట్టూర్చుతూ కుర్చీలో కూర్చుండిపోయాడు.

బాగా రాత్రి అయ్యాక తియ్యొచ్చు. ఈ దినం గడిస్తే రేపుచూసుకోవచ్చు. దమ్మన వర్షంపడితే బాగుంటుంను.

దగ్గు
గేటుచప్పుడు
స్కూటర్
ఎవరొచ్చినా లేడని తిరిగిపోతారు.
తెల్లవారాలి
బాగా వర్షంకురవాలి.

* * * *

"ఇంతవర్షంలో వచ్చారే, బాగా తడిసిపోయారు."

"మాకు వర్షంఏమిటి? తుఫానేమిటి? రాజుగారిదర్శనం వొట్టిగనేకాదుగా!"

"మహేశ్వరీ! కాఫీపెట్టు. ధర్మయ్యగారూ వాళ్లావిడావచ్చారు."

వంటగదిలాంటి గుహలోంచి బుజ్జిగాణ్ణి ఎత్తుకొని వచ్చింది మహేశ్వరి ధర్మయ్యగారి ధర్మపత్ని బాబును తీసుకుంటూ, "చాలా ముద్దొస్తున్నాడమ్మా నీ కొడుకు. కాఫీగీఫీ ఏమీవద్దు. ఇంటికివెళ్తాంకదా" అంది.

"కాదుకాదు, కాఫీపెట్టు మహేశ్వరీ !.... ఇక్కడకూర్చోండి", తను స్టూలు మీద కూర్చుంటూ కుర్చీ చూపించాడు ధర్మయ్యకు.

పైకప్పు అవీచూస్తూ "రాజూ ! రెండునెల్లవాయిదా అయిపోయింది. అయి దంటే పది, పదిహేనంటే పదిహేను ఏతారీఖంటే ఆ తారీఖుక్కవస్తున్నాను, పోతున్నాను. స్కూటరు నీళ్ళతోనడిచేదైతే ఎన్నిసార్లైనా వచ్చేవాణ్ణి. మాకేం పను లుండ వనుకున్నావా మీ ఇంటిచుట్టూ ప్రదక్షిణం చేయడానికి ?" కొంచెం కటువు గానూ, కొంచెంమెత్తగానూ అన్నాడు ధర్మయ్య.

రాజుకు నోరులేదు.

"అదికాదండీ. మా ఆవిడకు ఈ కాన్పు చాలాకష్టమైంది. ఖర్చుకూడాజాస్తి గానే అయ్యింది. ఇంకొక్కనెల ఆగండి," అబద్ధం చెప్పకతప్పలేదు రాజుకు.

"కాన్పుకాన్పు ! కంటానికేమిటి, యాడాదికి రెండుసార్లయినా కంటారు. నా పైసలు నాకిచ్చేసెయ్, పోతాను."

తనకు పిల్లలులేనికోపంకంతా బయటపడింది ధర్మయ్యగారిమాటల్లో. రాజు చాలా నెమ్మదిగా తెచ్చిపెట్టుకున్ననవ్వుతో "ఇది అదనంగావచ్చిన ఖర్చండి" అన్నాడు.

"అదనంగా ఎందుకు కనాలిమరి ?"

తనోకప్పుతీసుకొనివస్తూ, "బాగానేవున్నారు. కంటారు చంపుకుంటారు వాళ్ళ ఇష్టం. మీపైసలేమో మీరుఅడగండి అవన్నీ మనకెందుకు ?" అంది.

మహేశ్వరి కాఫీతెచ్చి రాజుకందించింది. రాజు కిందనేపెట్టేశాడు. "వాడుకు ఒక్కడేగదండి. వాడుకాస్తా గుటుక్కుమంటే ఇంకేందిక్కని.... ఏదోదేవుడు దయ దల్చాడు " మహేశ్వరి సిగ్గుతో కలదించుకుంది.

"పిల్లలులేక మేం చస్తున్నామా ? గొంగడున్నంతవరకే కాళ్లచాపుకోవాలి." ధర్మయ్యగారు అంటున్నమాటలు నిజమేఅనిపిస్తున్నా, రాజుకు కొరడాకొట్టినట్టుగా తగుల్తున్నాయి.

"పోనీ ఇంకో నాలుగురోజులు టైం ఇవ్వండి. నావల్ల ఇక మీకుబాధవుండదు.

"అంటే చస్తావా ఏమిటి ?"

"ఛ ఏంమాటలు? రాజుగారూ ఎలాగో ఒకలాగు తెచ్చిఇవ్వండి. మహేశ్వరిని బాబును చూసిపోదామని వచ్చాం పదండి."

భార్యమాట పాటించాడు ధర్మయ్య. మౌనంగాలేస్తూ.

"కాస్సేపాగి వెళ్ళండి. వానతగ్గలేదు." రాజు పల్లగొంతు.

"నీకోసం రోజూ చూస్తూవుంటా.... పదవే". ధర్మయ్య గేటుదాటి స్కూటర్ స్టార్ట్ చేశాడు. ఆ చప్పుడులో రాజుకాళ్ల తీగలా వొణికిపోయాయి.

"చూడండి, బుజ్జిగాడు ఎట్లా నవ్వుతున్నాడో!" మహేశ్వరి కొడుకుసు అందివ్వబోయింది రాజుకు.

అవునే వాడు నవ్వుతున్నాడు, ఎందుకో తెలుసా? నన్నుచూసి నా దౌర్భాగ్యాన్నిచూసి. వెల్లవెల్ల. నన్ను కొత్త ప్రశాంతంగా కూర్చోనివ్వ".

వీడిపేరు ప్రశాంతండి. ఎత్తుకుంటే అన్నీ మరిచిపోతారు." రాజుకు నవ్వూ దుఃఖం రెండూవచ్చాయి. గబుక్కున బాబును చేతుల్లోకి తీసుకొని మెడ బుగ్గలూ బుచ్చిబుచ్చి వేళ్లూ అరచేతులూ గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు రాజు.

"మన మీ ఇల్లు ఖాళీచేసెయ్యాలి మహేశ్వరీ."

"ఎందుకండీ?"

"శాంతి కోసం".

"నాకర్థంకాలేదు"

"కాదు- నీలవేణి తినేపడుకుందా?"

"ఆఁ"

* * * *

తెల్లారిపోతుంది.

దొర్లిదొర్లి పక్కటెముకలు నొప్పిపెడుతున్నాయి. కళ్ళు గరగరమండుతూ బరువెక్కాయి. రాజుకి నిద్రరావడంలేదు. మహేశ్వరి, నీలవేణి, బాబు వొళ్ళు తెలియకుండా నిద్రపోతున్నారు. సన్నగా వర్షంపడుతూనేవుంది. చలిగాలి రివ్వున వీస్తోంది. గేటుచప్పుడు వినిపిస్తూనేవుంది. కిరాయికట్టలేదు. ఇంటియజమాని పొద్దు పొడవకముందే వస్తాడోఏమో! నాగయ్యేందుకురాడు! ధర్మయ్యకు తన మాటమీద నమ్మకంలేక అతనూ వస్తాడోఏమో!

ఏమో! చెల్లెలు హాయిగానే వుండొచ్చు. అన్న అప్పులబాధ ఆమెకెందు కర్థమవుతుంది? ఈ రోజుల్లో ఎవరి బాధలు ఎవరు సానుభూతితో వింటున్నారు!

666

మనిషి మనిషికీ మధ్య పోటీ ఒకడి తలమీంచి ఒకడు నడిచిపోవాలని, ఒకడిదగ్గర ఎంత వీలైతేఅంత, ఏరకంగా వీలయితే ఆరకంగా, గుంజుకు తినాలని, సుఖంగా హాయిగా శాంతిగా బతకాలని. స్నేహాలు, ప్రేమలు, బంధుత్వాలు అన్నీ వడ్డీబండల కింద, అప్పుల రథచక్రాలకింద. తనకిక మోక్షంలేదు. ఎలా ఎలా? ఈ వలయాన్ని ఎక్కడ ఎలా ఛేదించాలి? నిద్రి శాంతి.

*　　*　　*　　*

అయ్యగారూ, కిటికీ వూడ్చుతుంటే, అంచుమీద ఈ ఉత్తరం దొరికింది". పళ్ళుతోముకుంటున్న ధర్మయ్య పేస్టుఉమ్మేసి "ఇదెక్కడి కబురు ఇంతపొద్దున్నే! ఏమే ఇలారా!" అంటూ గబగబా విప్పాడు.

"ధర్మయ్య గారికి!

హృదయపూర్వక నమస్కారాలు. నేనిక ఈ జీవితంలో మీ అప్పుతీర్చలేను. ప్రతినెలా ఎంత ప్రయత్నించినా వడ్డీకూడా చెల్లించలేకపోయాను. ఇకముందు చెల్లిస్తానన్న నమ్మకంలేదు. నన్ను మనసారా క్షమించండి. ఇక ఎప్పుడూ మా యింటికి రాకండి. నేను రేపే ఇల్లుఖాళీచేస్తున్నా. బతికుంటే ఎప్పుడైనా కలుసుకుందాం. మా గుండెలు బండబారినై. మా మాటలకు విలువలేదు. అబద్ధాల మయ్యాం. ఇచ్చినవాడికి తీసుకున్నవాడు ఎప్పుడూలోకువే. మాకెంత మానవత్వం ఉన్నా, వడ్డీగట్టకపోతే గంగలోకలిసినట్టే. నన్ను కలుసుకునే ప్రయత్నంచేయకండి. మీ కాళ్లపట్టుకుంటాను. మమ్మల్ని మరిచిపోండి. నాకు ఏ ఆస్తివుందని మీకు రాసివ్వను.? ఈ జీవితంలో నలుగురు పిల్లల్నిమాత్రం సంపాదించాను. వాళ్ళే నా ఆస్తి, నా సర్వస్వం, నా ప్రాణం. ఇంకేంరాయను? అమ్మడంకాదు. తాకట్టు పెట్టడంకాదు. మీకు శాంతికలిగితే సంతోషిస్తాను. మీ గొడ్లచావిడికి పరిగెత్తండి. చలిలో వొణికిపోతుంటాడు బుజ్జిగాడు.

మమ్మల్ని కలుసుకోవద్దని, ఈ రకంగానైనా నన్ను ఋణవిముక్తుణ్ని చేయమని ప్రార్థిస్తూ-

మీ
రాజు."

667

[రచనాకాలం : 9-8-1973]